సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

మూడు దశాబ్దాల కల నెరవేరిన వేళ

- వందపడకల ఆస్పత్రిగా అగనంపూడి సీహెచ్‌సీ
- నాడు నేడు కార్యక్రమంలో రూ. 17 కోట్లతో అభివృద్ధి
- తుదిదశకు చేరుకున్న నిర్మాణ పనులు
- అందుబాటులో అధునాతన వైద్య పరికరాలు




అగనంపూడి ఆస్పత్రి ముఖద్వారం

అగనంపూడి: మూడు దశాబ్దాల కళ నెరవేరింది. ప్రభుత్వాలు మారిపోయాయి. పాలకులు మారుతూ వచ్చారు. గుప్పించిన హామీలు గాలిలో కలిసిపోయాయి. అయినా అగనంపూడి ఆస్పత్రి దిశ మారలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రికి మహర్దశ పట్టింది. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కృషి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో గాజువాక నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష నెరవేరింది. చిరకాల స్వప్నం ఫలించింది. మూడు దశాబ్దాలుగా అగనంపూడి ఆస్పత్రి స్థాయి పెంచాలని ప్రభుత్వాలు మారిన ప్రతీసారి స్థానిక ప్రజా సంఘాలు విన్నవించుకోవడం తప్పా ఫలితం దక్కేది కాదు. టీడీపీ ప్రభుత్వం దిగిపోయే ముందు ఏరియా ఆస్పత్రిగా మార్చుతున్నామని ప్రకటించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అగనంపూడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) స్థాయిని ఏరియా ఆస్పత్రిగా మార్చు చేయడంతోపాటు నాడు నేడు కార్యక్రమంలో రూ.17 కోట్లతో పారిశ్రామిక ప్రాంత పెద్దాస్పత్రిగా రూపు మారిపోయింది. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) సారథ్యంలో నిర్మాణ పనులు చేపట్టారు. వచ్చేనెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలనే తలంపుతో అధికారులు ఉన్నారు.

అడ్మిన్ బ్లాక్, మదర్ అండ్ చైల్డ్ హెల్త్ కేర్ (ఎంసీహెచ్‌సీ) బ్లాక్, మార్చురీ, ఇంటర్నల్ రోడ్లు, డ్రైన్లు, ఎస్టీపీ, సంప్‌లు, ఫైర్ ఎక్విప్‌మెంట్, సంప్, పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టారు. సివిల్ నిర్మాణ పనుల కోసం రూ. 16 కోట్లు కేటాయించగా, మిగిలిన మొత్తంతో వంద పడకల ఆస్పత్రికి కావలిసన వైద్య పరికరాలు అమర్చనున్నారు. ఇప్పటికే దాదాపు అన్ని నిర్మాణ పనులు పూర్తికాగా, వైద్య పరికరాలు అమర్చే పనులు ప్రారంభించారు. అడ్మిన్ బ్లాక్ మూడు, ఎంసీహెచ్‌సీ బ్లాక్‌లు మూడు అంతస్తుల్లో నిర్మాణాలు సాగాయి. సుమారు 52 వేల చదరపు అడుగుల్లో నిర్మాణ పనులు చేపట్టారు. వచ్చేనెలాఖరునాటికి అధునాతన వసతులతో కూడిన ఆవరణ అందుబాటులోకి రానున్నది.

ఆస్పత్రిలో సౌకర్యాలు

అడ్మిన్‌బ్లాక్, ఎంసీహెచ్‌సీ బ్లాక్, ఇంటర్నల్ రోడ్లు,డ్రైన్లు, ఎస్‌టీపీ, సంప్‌లు, ఫైర్ ఎక్విప్‌మెంట్, పంప్‌హౌస్, విద్యుత్

ట్రాన్స్‌ఫార్మర్ల కోసం కేటాయించిన నిధులు : రూ. **16** కోట్లు

వైద్య పరికరాలకు కేటాయించి నిధులు : **రూ. కోటి**


అడ్మిన్ బ్లాక్


శరవేగంగా నిర్మాణమవుతున్న ఎంసీహెచ్ బ్లాక్

మెరుగైన వైద్య సేవలు



నా చిన్నప్పటి నుంచి ఆస్పత్రిని వంద పడకల స్థాయికి పెంచాలని స్థానికులు కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇది నెరవేరినందుకు సంతోషంగా ఉంది. అగనంపూడి ఆస్పత్రికి నాలుగు మండలాలు, జీవీఎంసీలోని గాజువాక, పెందుర్తి, పశ్చిమ నియోజకవర్గాల నుంచి రోగులు వచ్చి సేవలు పొందుతున్నారు. వసతులు అందుబాటులోకి వస్తే పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది.

–నక్కా నాయుడు, బీసీ కాలనీ

దాదాపు పూర్తి కావచ్చింది



నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. పనులు సత్వరం పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఇంటర్నల్ రోడ్లు, వైద్య పరికరాలు అమర్చనున్నాం.

–మధుసూధనరావు, డీఈ, ఏపీఎంఎస్ఐడీసీ

పేదల వైద్యానికి పెద్దపీట..



నిరుపేదల వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఇక్కడి జరుగుతున్న అభివద్ధిని చూస్తే అర్థమవుతోంది. సామాన్యులకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షకు నిదర్శనంగా అగనంపూడి ఆస్పత్రి నిలుస్తోంది. పారిశ్రామిక ప్రాంతీయులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించే అవకాశం దక్కడం ఈ ప్రాంతీయుల అదృష్టం.

–చట్టి తాతారావు, కొత్తూరు కాలనీ

క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష-2ను విజయవంతం చేయాలి


సమావేశంలో పాల్గొన్న లక్ష్మారెడ్డి

గాజువాక : వచ్చేనెల 3 నుంచి జూన్ నెల వరకు నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ ప్రత్యేకాధికారి డి.లక్ష్మారెడ్డి కోరారు. గాజువాక నియోజకవర్గంలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ప్రతి బుధ, గురువారాల్లో మాత్రమే జరుపుతామన్నారు. ఇద్దరు వైద్యాధికారులు, ఇద్దరు స్పెషలిస్టులు, కంటి, దంత వైద్యులు తమ సేవలను అందిస్తారన్నారు. రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సన్యాసిరావు, జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, గాజువాక సీహెచ్‌వో నాగ అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు


కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల తాకిడి

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. అర్చనలు, అభిషేకాలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణాచార్యులు 15వ పాశురం చదివి వినిపించారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతులు తొలి పూజ చేశారు. ఆలయ కమిటీ భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

1,052వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం: దేశంలోని ప్రభుత్వరంగ సంస్థను ప్రైవేటీకరణ చేస్తూ కార్మిక కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం భరోసా లేకుండా చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చ్ వద్ద జరుగుతున్న రిలే దీక్షలు శనివారం నాటికి 1052వ రోజుకు చేరుకున్నాయి. పలు విభాగాల కార్మికులను పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వృద్ధుడికి మానవతా సభ్యుల అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న కృష్ణంరాజు

గాజువాక: కొడుకు ఉండీ అనాథలా మిగిలిన ఒక వృద్ధుని మృతదేహానికి మానవతా స్వచ్ఛంద సంస్థ గాజువాక యూనిట్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. పశ్చిమ బంగాకు చెందిన బాలైచంద్ర ఛటర్జీ తన భార్యతో కలిసి గాజువాకలో నివాసముంటున్నారు. ఛటర్జీ శనివారం మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు వారి కుమారుడికి తెలియజేసినప్పటికీ అతడు రావడానికి నిరాకరించారు. ఈ విషయం తెలుసుకున్న మానవతా సంస్థ చైర్మన్ దీనంకొండ కృష్ణంరాజు తమ శాంతిరథం సహాయంతో వృద్ధుని మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రధాన రహదారుల్లో చెత్త తొలగింపు

గాజువాక: వివిధ ప్రాంతాల్లోని ప్రధాన రహదారు పేరుకుపోయిన చెత్త కుప్పలను జీవీఎంసీ అధికారులు ఆదివారం తొలగించారు. ఈ చర్యలను అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఆందోళనకారులతో చర్చలు జరిపిన అధికారులు పోలీసుల సహకారంతో కణితి రోడ్, పాతగాజువాక జంక్షన్, మార్కెట్ రోడ్, వడ్లపూడి ముస్తఫా రోడ్డు, కూర్మన్నపాలెం రోడ్లలో చెత్తలను తరలించారు.

ఘనంగా విగ్రహాల ఆవిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌లని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. పెదగంట్యాడ జంక్షన్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శమన్నారు. దేశం కోసం పని చేసిన మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అటువంటి వారి విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారని చెప్పారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, పులి లక్ష్మీభాయి, దల్లి గోవింద్, నాయకులు మంత్రి రాజశేఖర్, అన్వేష్, పైడిరాజు, గంట్యాడ గోవిందరాజు, ఎస్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత సగర సమైఖ్య కమిటీకి స్వాగతం


కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న సగర నాయకులు

అక్కిరెడ్డిపాలెం: అఖిల భారత సగర సమైఖ్య కమిటీ సభ్యులు 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీకి విచ్చేశారు. శనివారం సగర సంఘం నాయకులకు కాలనీ వాసులు సాదర స్వాగతం పలికారు. సమైఖ్య కమిటీ ఢిల్లీ నుంచి గత నాలుగు నెలలుగా నార్త్, సౌత్ రాష్ట్రాల సగరల సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేస్తూ గుడివాడ అప్పన్నకాలనీకు విచ్చేశారు. ముందుగా రామాలయం ఎదురుగా గల భగీరథ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రామాలయం వద్ద సమావేశం నిర్వహించారు. భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో 20 కోట్ల మంది సగరులున్నా సరైన గుర్తింపు లేదని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ సగర ప్రతినిధి భగవత్ చౌహాన్, ఉమ్మడి జిల్లాల సగర అధ్యక్షులు గుర్రం నూకరాజు, కన్వీనర్ గండికోట తాతారావు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్, అప్పన్నకాలనీ అధ్యక్షులు గుర్రం సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఈడీ స్వామికి సత్కారం


ఎస్‌వీ స్వామిని సత్కరిస్తున్న స్టీల్ ఇంటక్ నాయకుడు మంత్రి రాజశేఖర్, నాయకులు


ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) ఎస్‌వీ స్వామి ఆదివారం పదవీవిరమణ చేయనున్న నేపథ్యంలో స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో నాయకులు శనివారం ఆయనను సత్కరించారు. కార్మిక సంక్షేమానికి తీసుకున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ తర్వాత ప్లాంట్ సంక్షేమం కోసం కృషి చేయాలని, ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉండే విధంగా చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొణతాల శ్రీను, బి.నాగరాజు, పీవీ నగేష్, గొందేశి ప్రభాకర్ రెడ్డి, పి.పోతా రెడ్డి, ఎస్.ఏ.నాయుడు, బి.అప్పారావు, సుదర్శనం, బి.వరహాలబాబు, గంగవరం గోపి, బైరెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న యువకులు

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందుస్తాన్ స్కాట్ అండ్ గైడ్స్ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఛత్రపతి శివాజీ వందే భారత్ బ్లడ్ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 52 మంది రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని పాఠశాల హెచ్‌ఎం రాచకొడ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక సంస్థల్లో నిర్వహిస్తారని మొట్టమొదటి సారిగా విద్యార్థులు పాఠశాలలో నిర్వహంచడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా ముందుగా ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేశారని చెప్పారు. రక్తదానంపై ఉన్న అపోహలు తొలగేలా అవగాహన కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, వినోద్‌బాలు, షేక్ బాబ్జి, సురేష్, నరసింహ, భవాని శంకర్, ఆనంద్, నర్సింగ్, నీలి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ యువతరంగ్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెక్టార్ మధుసూధనరావు

అగనంపూడి: దువ్వాడలోని విజ్ఞాన్ విద్యా సంస్థల సారథ్యంలో వచ్చేనెల 11వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జాతీయ స్థాయిలో యువతరంగ్ నిర్వహించనున్నట్టు దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూధనరావు చెప్పారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో విజ్ఞాన్ యువతరంగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మాస్యూటిక్ కళాశాల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఫెస్ట్‌లో దేశం నలుమూలల నుంచి భారీ స్థాయిలో విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. క్రీడలు, సాంస్కృతిక, నృత్యం, ఫ్లాష్‌మాబ్, రంగోలి విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు రూ.5లక్షల వరకు నగదు పారితోషికం అందివ్వడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు జె.సుధాకర్, వై.శ్రీనివాసరావు, బి.అరుంధతి, ప్రోగామ్ కోఆర్డినేటర్ బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు


ఇస్లాంపేట పాఠశాల మైదానంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


ఆదర్శగ్రౌండ్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు


భెల్ గ్రౌండ్‌లో బ్యాటింగ్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు గుడివాడ లతీష్

పెదగంట్యాడ: ప్రతిభావంతులైన కీడాకారులకు ఉజ్వల భవిష్యత్ అందివ్వడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుం బిగించారు. క్రీడాకారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఈ క్రీడాపోటీలకు అనూహ్య స్పందన లభిస్తోంది. మండలంలోని పలు ప్రాంతాల్లో ఆడుదాం-ఆంధ్రా పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో, ఇండోర్ స్టేడియంలో, ఆదర్శ గ్రౌండ్‌లో, ఇస్లాంపేట పాఠశాల మైదానం, గంగవరం పాఠశాల మైదానంలో వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు క్రీడాకారుల నుంచి మంచి స్పందన లభించింది. సచివాలయం పరిధిలో నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. వివిధ సచివాలయాల పరిధిలో నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఖోఖో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఆదర్శ గ్రౌండ్‌లో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇండోర్ స్టేడియంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. పెదగంట్యాడ మండల పరిధిలో నిర్వహించిన పలు పోటీల్లో 40 జట్లు పాల్గొన్నాయని జీవీఎంసీ జోన్-6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు.

అక్కిరెడ్డిపాలెం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా భెల్ (హెచ్‌పీవీపీ) గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలను నిర్వహించారు. శనివారం హరిజన జగ్గయ్యపాలెం సచివాలయం పరిధిలో మూడు జట్లు పాల్గొనగా, కొత్తగాజువాక సచివాలయం పరిధిలో ఆరు జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఐదు మ్యాచ్‌లు జరిగాయి. పోటీలను 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సంగ్రాన నూకరాజు, సచివాలయ ఉద్యోగులు సత్యనారాయణ, జనార్దన్, దీపక్, ప్రవీణ్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు


నృత్యాలు చేస్తున్న చిన్నారులు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెంలోని రవీంద్ర భారతి పాఠశాలలో శనివారం ప్రిన్సిపాల్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ 2024 సంవత్సరంలో ప్రతి ఒక్కరూ తాము కోరుకున్న ఆశయాలు నెరవేరాలని ఆకాంక్షించారు. పాఠశాల ఆవరణలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన వేతనాన్ని తక్షణం అమలు చేయాలి

ఉక్కునగరం: విశాఖ స్టీల్ ప్రోగ్రెసివ్ యూనియన్ కార్యవర్గ సమావేశం ఎల్‌ఎంఎం పార్క్‌లో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో స్టీల్‌ప్లాంట్‌పై జరుగుతున్న పోరాట పరిస్థితి, భవిష్యత్తులో యూనియన్లుగా అనుసరించవల్సిన వైఖరిపై యూనియన్ ప్రతినిధులు చర్చించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ జిందాల్‌లో జరిగిన ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఉక్కు ఉద్యోగులకు నూతన వేతనాన్ని తక్షణం అమలు చేయాలని, విశాఖ ఉక్కును సెయిల్ పరిశ్రమలో కలపాలని, ఉక్కు నిర్వాసితులకు తక్షణం ఉపాధి కల్పించాలని, యువత ఉద్యోగుల సమస్యలపై యూనియన్ కార్యవర్గం పనిచేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా ఏవీఎస్ఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కాంద్రేగుల శ్రీనివాస నాయుడు, నిర్వాహణ అధ్యక్షుడిగా ఎంఎల్‌పీజీ కిషోర్ బాబు, కోశాధికారిగా జి.ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షుడిగా కె.సింహాచలం, కార్యదర్శిగా డి.వెంకట అప్పారావు, సహాయ కార్యదర్శిగా రామ్మోహన్‌తో పాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

బీసీలను మోసం చేసింది టీడీపీనే..

అగనంపూడి: జయహో బీసీ సమావేశాలు నిర్వహిస్తామని టీడీపీ నేత నారా లోకేష్ ప్రకటించడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి యలమంచిలి అప్పారావు ఆరోపించారు. టీడీపీ పాలనలో బీసీలు నిలదొక్కుకునేందుకు ఎటువంటి అవకాశం ఇవ్వలేదన్నారు. బీసీ కులాలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. నామినేటేడ్ పోస్టుల్లో కనీసం ఒక ఉన్నత పదవిని కేటాయించకపోవడం దారుణమని పేర్కొన్నారు.

పెన్షన్ పెంపుదలలో మొండి వైఖరి విడనాడాలి

అగనంపూడి: ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసి విశ్రాంత ఉద్యోగుల ఈపీఎఫ్ పెంపుదలలో కేంద్ర ప్రభుత్వ వైఖరి సరికాదని పెన్షన్ల సంఘం కన్వీనర్ బుదే సుశీల గజేందర్ రావు అన్నారు. అగనంపూడిలో కేంద్ర ప్రభుత్వ పెన్షన్ దారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెట్రోలియం ఉత్పత్తులు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని అయినా కేంద్ర ప్రభుత్వం పెన్షన్ పెంచకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కె.అప్పారావు, బి.సత్యనారాయణ, ఎం.రామచంద్రరావు, ఎం.మస్తాన్ రెడ్డి, డి.రమేష్ పాల్గొన్నారు.

మరో రూ.79.80 లక్షల ఆస్తి పన్ను వసూలు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ అధికారులు శనివారం మరో రూ. 79.80 లక్షల ఆస్తి పన్ను వసూలు చేశారు. ఉరుకూటి వరలక్ష్మి, ఓ.మోహనరావులనుంచి ఈ మొత్తాన్ని వసూలు చేసినట్టు గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్, ఆర్‌ఐలు కె.శివ, రెడ్డి మోహన్, సుభాన్‌లను అభినందించారు.

అయోధ్య రాముని అక్షింతలు అందజేత

అక్కిరెడ్డిపాలెం: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని పూజిత పవిత్ర అక్షింతలను దువ్వాడలోని శ్రీ సీతారాముల ఆలయానికి అందజేశారు. శనివారం భజరంగ్ దళ్ ప్రతినిధులు శ్రీ సీతారామాల ఆలయానికి వితరణ కావించారు. జనవరి 1వ తేదీ నుంచి ఈ అక్షింతలను ప్రతీ ఇంటికి అందజేయనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో 88వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు జి.గంగా మహేష్ రమేష్, దేముడు తదితరులు పాల్గొన్నారు.